# ఆందోళన చెందాల్సిన పనిలేదు

**ఎన్నికలు అయిపోగానే తిరిగి సంక్షేమ పథకాలు అమలు చేస్తాం: నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం:ఎమ్మెల్యే దానం నాగేందర్**

బంజారాహిల్స్,అక్టోబర్ 10: ఎన్నికల కోడ్ కారణంగా హఠాత్తుగా నిలిచిపోయిన బీసీ బంధు, దళితబంధుతో పాటు ఇతర అన్ని పథకాలన్నింటినీ ఎన్నికల తర్వాత అర్హులకు అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు. మంగళవారం జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే దానం నాగేందర్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలన్నింటిని ఎన్నికల కోడ్ రావడంతో నిలిపివేయడంతో కొంతమంది ఆవేదన చెందినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అయితే ఎవరూ నిరాశకు గురికావద్దని, మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయయని. అన్ని పెండింగ్ పథకాలను అమలు చేయడం ఖాయమన్నారు. ఈనెల 15న సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టనున్న ప్రవేశపెట్టనున్న మేనిఫెస్టోలో పేదల కోసం మరిన్ని సంక్షేమ పథకాలను తీసుకరానున్నట్లు పేర్కొన్నారు. జూబ్లీ హిల్స్ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని, చిన్న చిన్న ఇబ్బందులను పట్టించుకోవద్దని కోరారు.

కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి ,సంక్షేమ పథకాలను చూసి తాను కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరామని, ఎమ్మెల్యే దానం నాగేందర్ నాయకత్వంలో మరోసారి ఖైరతాబాద్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

## బీఆర్ఎస్‌కు లక్ష ఓట్ల మెజార్టీ ఖాయం

ముషీరాబాద్, అక్టోబర్ 10: ముషీరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ భారీ మెజారిటీతో మరో మారు విజయం సాధించబోతుందని, నిత్యం ప్రజల మధ్య ఉండే ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు గత ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ కంటే రెట్టింపు మెజారిటీ రావడం ఖాయమని ఆ పార్టీ నేత బొట్టు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వివాదాలకు తావు లేకుండా అంతా కలిసికట్టుగా పని చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్‌కు లక్ష ఓట్ల భారీ మెజారిటీ కట్టబెట్టడానికి తమవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చరిత్రలో ఎన్నడూ ఎరుగని రీతిలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కళ్లారా చూసిన ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.

## నైపుణ్యవంతులైన వైద్యులను తయారు చేస్తాం

ఖైరతాబాద్, అక్టోబర్ 10 : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం నైపుణ్యవంతులైన వైద్యులను తయారు చేస్తామని బెలారస్‌కు చెందిన గోమెల్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీ వైస్ డీన్ డాక్టర్ గ్రిగోరి తెలిపారు. సోమాజిగూడలోని ఓ హోటల్‌లో ఏర్పా టు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రపంచానికి రోజు రోజుకు వ్యాధుల ముప్పు పెరుగుతున్నదని, ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది కొరత కూడా ఏర్పడుతున్నదన్నారు. ప్రభుత్వ నిర్వహణలో ఉన్న తమ వైద్య విశ్వవిద్యాలయంలో విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. దేశంలో నిర్వహిస్తున్న నిట్‌లో అర్హత సాధించిన వారికి అవకాశం ఉంటుందన్నారు.




బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న గ్రిగోరి, రాజారాం, సంగీత

# ఫ్లెక్సీలు, బ్యానర్‌లు వెంటనే తొలగించాలి

- **ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**
- **అధికారులు, పార్టీల నేతల సమావేశంలో ఎన్నికల అధికారి లక్ష్మినారాయణ**

ముషీరాబాద్, అక్టోబర్ 10: రాజకీయ పార్టీల ఎన్నికల అభ్యర్థులు, నాయకులు ఎన్నికల నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ముషీరాబాద్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) వి.లక్ష్మినారాయణ తెలిపారు. నియోజకవర్గంలో ఎన్నికలు సాఫీగా సాగేలా అన్ని పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన జీహెచ్ఎంసీ సర్కిల్-15 కార్యాలయంలో ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎన్నికల నిర్వహణ తీరుపై చర్చించారు. ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల విధి విధానాలపై చర్చించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అన్ని పార్టీలు పాటించాలని, సభలు, సమావేశాలు ఎన్నికల సంఘం అనుమతిలేకుండా నిర్వహించరాదని, ప్రచారం సమయ పాలన పాటించాలని కోరారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నంలోగా పబ్లిక్ ప్లేస్‌లు, ప్రైవేటు వ్యక్తుల ఇళ్లపై ఉన్న ప్రచార ఫ్లెక్సీలు తొలగించాలని లేని పక్షంలో తామే తొలగించి ఆ వ్యయాన్ని సదరు రాజకీయ పార్టీ అభ్యర్థి ఎన్నికల ఖర్చులో జమచేయనున్నట్లు తెలిపారు. ఎన్నిక ప్రచారం, సభల ఏర్పాటు కోసం సువిధయాప్‌లో వివరాలు నమోదు చేసి అనుమతి తీసుకున్న తరువాతనే ప్రచారం నిర్వహించుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయ ఖర్చు, నిబంధనలు పాటించడం, ప్రలోభాలు వంటి అంశాలపై ఎన్నికల అధికారులు, పోలీసుల నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు. అన్ని విభాగాల అధికారులు, ప్రజల సహకారం తో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకువెళ్తున్నట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాల వారీగా సిబ్బంది నియామకం, సౌకర్యాల కల్పన పూర్తి చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళి ఉల్లంఘించకుండా నిరంతర నిఘా ఉంటుందని చెప్పారు. ఎన్నికల విధుల కోసం ఇప్పటికే స్టాటిక్ సర్వైలెన్స్(ఎస్ఎస్), ఫ్లైయింగ్ స్కాడ్ టీం(ఎఫ్ఎస్‌టీ)విజువల్ సర్వైవలెన్స్(వీఎస్‌టీ), వీడియో విజువల్ టీం(వీవీటీ), మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) బృందాలను నియమించినట్లు తెలిపారు.



అధికారులు, వివిధ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) వి.లక్ష్మీనారాయణ

### మహిళలపై వార్తా కథనాలపై

## స్వీయ నియంత్రణ అవసరం




సమావేశంలో మాట్లాడుతున్న సత్యవతి

ఖైరతాబాద్, అక్టోబర్ 10 : మీడియాల్లో మహిళలపై ప్రసారం చేసే, ప్రచురించే కథనాలపై స్వీయ నియంత్రణ అవసరమని భూమికా ఫౌండేషన్ ప్రతినిధి సత్యవతి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజా షాతో కలిసి మాట్లాడారు. ఆడపిల్లలు, చిన్నపిల్లలపై అఘాయిత్యాలు జరిగితే మీడియాలో హైలైట్ చేసి చూపించడం మానుకోవాలని, ఆ సంఘటన సున్నితత్వాన్ని గుర్తించి బాధితులకు న్యాయం జరిగే విధంగా కథనాలు ఉండాలన్నారు. ఇప్పటికే తమ సంస్థ ఆధ్వర్యంలో జర్నలిజం కోర్సులను చదువుకునే విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళలకు సంబంధించిన అంశాలను కొన్ని మీడియా సంస్థలు తగ్గించాయని, వారి సాధికారిత తదితర విషయాలను ప్రసారం చేయాలన్నారు.

## బీసీలకు అధిక శాతం సీట్లు ఇవ్వాలి



హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

హిమాయత్‌నగర్,అక్టోబర్10: తెలంగాణ రాష్ట్రంలో త్వరల్లో జరిగే శాసన సభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు అధిక శాతం సీట్లు కేటాయించాలని బీసీ హక్కుల సాధ న సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకట్రాములు కోరారు.మంగళవారం హిమాయత్ నగర్‌లోని మఖ్దూం భవన్‌లో సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట సభలలో బీసీలకు యాభై శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు పెట్టి కులగణన చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం బీసీల అభ్యున్నతి కోసం బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఎల్.శ్రావణ్‌కుమార్,బొడ్డుపల్లి కృష్ణ,మేకల శ్రీనివాసరావు,నర్సయ్య,జనార్దన్, మల్లేశ్,యాదగిరి పాల్గొన్నారు.

## 15 నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు

చిక్కడపల్లి, అక్టోబర్ 10 : నగరంలో ప్రసిద్ధి గాంచిన చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలను ఈ నెల 15నుంచి 23 వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయం కార్యనిర్వాహణాధికారి మాచర్ల దేవనాథం, ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ బాసాని పద్మ తెలిపారు. మంగళవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేవాలయ ప్రాంగణంలోని శ్రీ భువనేశ్వరీదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అమ్మవారికి ప్రతి రోజూ ఉదయం 5 గంటలకు అభిషేకం, 8.30 కుంకుమార్చనలు, 9.30 చండీహోమం, సాయంత్రం 6 గంటల నుంచి 7.30 వరకు సహస్రనామార్చన, రాత్రి 8 గంటలకు ఆరగింపు, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

## గవర్నర్‌కు ఆహ్వానం

చిక్కడపల్లి,అక్టోబర్10: దసరా పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరు కావాలని అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి, హర్యానా గవర్నార్ బం డారు దత్తాత్రేయ మంగళవారం రాష్ట్ర గవర్నార్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి ఆహ్వానించారు.